క్లుప్తంగా

చురుగ్గా రామాలయ నిర్మాణ పనులు



వాడచీపురుపల్లిలో సాగుతున్న రామాలయ నిర్మాణ పనులు

పరవాడ: వాడచీపురుపల్లిలో దశాబ్ద కాలంగా నిలిచిపోయిన శ్రీరాముల ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాత ఆలయాన్ని పూర్తిగా తొలగించి నూతన ఆలయాన్ని నిర్మించాలని గ్రామ పెద్దలు పదేళ్ల కిందట పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో కొంత మొత్తాన్ని సమీకరించి పునాదులు, పిల్లర్లు నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధుల లేమి కారణంగా కొంత కాలం పాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల దాతల నుంచి రాబట్టిన నిధులతో మాజీ ఎంపీపీ అప్పలనాయుడు ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం ఆలయ శ్లాబు నిర్మాణ పనులను దగ్గరుండి చకచకా పూర్తి చేయిస్తున్నారు.

పట్టుబడ్డ కోళ్ల దొంగలు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామంలో ఈ నెల 10న కోడి పుంజులు అపహరించుకుపోయిన ముగ్గురిలో ఇద్దరిని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు.. ఆరిపాకలో పిన్నంరాజు రామకృష్ణ కొన్నేళ్లుగా డింకీ కోళ్లు మేపుతున్నారు. ఒక్కో కోడిపుంజు విలువ రూ. 60 వేల నుంచి రూ. 80 వేలు ఉంటుంది. ఈ నెల 10న గుర్తు తెలియని దొంగలు 6 కోడి పుంజులను ఎత్తుకుపోయారు. రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లగిసెట్టిపాలెం,ఆరిపాక, టిక్కలిపాలెం, రాయపుర అగ్రహారం తదితర గ్రామాల్లో చిల్లర దొంగతనాలకు పాల్పడిన కొంత మందిని అప్పట్లో పోలీసులు గుర్తించారు. దీనిలో భాగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు విజయనగరం జిల్లా కొత్తవలసలో శుక్రవారం గంటా జార్జి, గంటా విలియంను పట్టుకుని వారి నుంచి 6 కోడి పుంజులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పట్టుబడిన నిందితులను అనకాపల్లి కోర్టుకు తరలించారు. మరొకరిని పట్టుకోవాల్సి ఉందని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



కనకరాజు (ఫైల్)

సబ్బవరం: సబ్బవరం – చోడవరం రోడ్డులోని గాలిభీమవరం జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గొటివాడకు చెందిన దుంగ కనకరాజు(45) ఆటోలో గురువారం రాత్రి చోడవరం వైపు నుంచి సబ్బవరం వైపు బట్టల లోడుతో వస్తున్నాడు. ఆటో గాలిభీమవరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఆటోను బలంగా ఢీకొంది. ఆటోను నియంత్రించే క్రమంలో అదుపు తప్పి పక్కనున్న గోతులో పడిపోయింది. దీంతో ఆటో నడుపుతున్న కనకరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. మృతుడికి భార్య పద్మతో పాటు ముగ్గురు కుమార్తెలు భవానీ, కల్యాణి, సాధన ఉన్నారు. జీవనాధారం కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

ఆయుష్మాన్ కార్డుల పంపిణీ



ఆయుష్మాన్ కార్డులు అందిస్తున్న రామునాయుడు

పరవాడ: సమాజంలో అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని పెందుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లి రామునాయుడు అన్నారు. మండలంలో కన్నూరు, రావాడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.5 లక్షల విలువైన ఆయుష్మాన్ కార్డులు అందించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారని రామునాయుడు కొనియాడారు. రావాడ, కన్నూరు గ్రామ ప్రజలకు ఆయుష్మాన్ కార్డులు అందించారు. నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పండగలా ‘పట్టా’భిషేకం

- 30 ఏళ్లనాటి గాజువాక భూ సమస్యకు పరిష్కారం
- లబ్ధిదారుల ఆనందోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు,చిత్రంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున తదితరులు



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

పెదగంట్యాడ: మూడు దశాబ్దాల నిరీక్షణ ఫలించింది. గాజువాక భూ సమస్యను పరిష్కరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసిన పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. భారీగా తరలివచ్చిన జనం చేసిన జై జగన్ నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది. పట్టాలు అందుకున్న ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. మండలంలోని గిరిజా కాలనీ శివాలయం గ్రౌండ్ శుక్రవారం పండగ వాతావరణం సంతరించుకుంది.

చారిత్రాత్మక నిర్ణయం

ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చారిత్రాత్మక నిర్ణయమని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లనాటి గాజువాక భూ సమస్య కు పరిష్కారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి ఒక్కరూ దానిపై హక్కును కలిగి ఉండాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు, ఉక్కు నిర్వాసితులకు, ఫార్మా సిటీ నిర్వాసితులందరికీ రూ.790 కోట్ల విలువ చేసే 7,026 పట్టాలను అందజేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషి వల్లనే ఇది సాధ్యపడిందన్నారు. నిరంతరం గాజువాక సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎటువంటి వ్యయ ప్రయాసలకూ వెనుకాడబోవడం లేదన్నారు.

భూమిపై సంపూర్ణ హక్కు

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పట్టాలు దేనికీ పనికి రాలేదన్నారు. ఇప్పుడు ఇచ్చిన పట్టాల వల్ల గాజువాక వాసులకు భూమిపై సంపూర్ణ హక్కు లభిస్తోందన్నారు. మూడు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెరవేర్చిందన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వందల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రజలకు శాశ్వత ప్రాతిపాదికన అందజేయడం సీఎం గొప్పదనమన్నారు.

7026 మందికి కన్వేయన్స్ డీడ్

కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ గాజువాక హౌసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ ఆక్రమిత భూముల్లో నివాసం ఉంటున్న 7026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించామని, మరో 6,260 అందించడానికి కన్వేయన్స్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఉక్కు కర్మాగార నిర్వాసితులకు, ఫార్మా నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు.

కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, బట్టు సూర్యకుమారి, ఇల్లపు వరలక్ష్మి, భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, నాయకులు కోమటి శ్రీనివాసరావు, పల్లా చినతల్లి, గుడివాడ లతీష్, దొడ్డి రమణ, బొడ్డ గోవింద్, రాజాన వెంకటరావు, వాసు, యువశ్రీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



30 ఏళ్లుగా భూములున్నా ఉపయోగించుకోలేకపోయాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పట్టాలు భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాయి. పిల్లల ఎదుగుదల వల్ల వారికి ఏమీ చేయలేకపోతున్నామనే బెంగ నేటితో తీరిపోయింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– లాలం వెంకట రమణ, భానోజీతోట

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశాం. ఇప్పటి వరకూ మమ్మల్ని ఉపయోగించుకున్న ప్రభుత్వాలే తప్ప మాకు ఉపయోగపడ్డ ప్రభుత్వాలు లేవు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం తరపున కృతజ్ఞతలు.

– షేక్ సుభాన్ బీబీ, శ్రీనగర్

చాలా ఆనందంగా ఉంది



ఇప్పటి వరకూ భూ పట్టాల సమస్య పరిష్కారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం. ఇప్పటికి పరిష్కారం కావడం ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వం చేతులమీదుగా భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటున్నాం.

– ఆదారి లక్ష్మి, భానోజీతోట

భరోసా ఏర్పడింది



ఆస్తి ఉన్నా భూమి అమ్ముకోవడానికి, తాకట్టు పెట్టుకోవడానికి పనికిరాకుండా పోయింది. ప్రస్తుతం పట్టాల పంపిణీ కారణంగా పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగపడతాయన్న భరోసా ఏర్పడింది. ప్రభుత్వానికి, సహకరించిన నేతలకు కృతజ్ఞతలు.

– ఎం.రామయ్యమ్మ, గాజువాక

ఘనంగా కూడారై ఉత్సవం



గంగధార వద్ద గోదాదేవికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వెంకన్నకు అభిషేకం చేస్తున్న అర్చకుడు



స్వామికి సమర్పించిన నైవేద్యం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలకరించి పల్లకీలో తీసుకువచ్చి ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద అదిష్టింపజేశారు. ఆలయంలోంచి వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తీసుకొచ్చి నీలాద్రి గుమ్మం వద్ద ఆస్థాన మండపంలో వేంచేయజేసి ఎదురు సన్నాహోత్సవాన్ని వైభవంగా జరిపారు. పాశుర విన్నపం, సాత్తుమొరై, ధనుర్మాస పూజలు జరిపారు. కూడారై ఉత్సవ విన్నపపారాయణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు నృత్యాలు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కూడారై ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామి, అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం అలంకరణ చేసి 700 స్టీలు పాత్ర(గంగాళాలు)ల్లో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పూజలు నిర్వహించి నక్షత్ర హారతి ఇచ్చారు. 27వ పాశురం విన్నపం జరిగింది.

దర్శించుకున్న ప్రముఖులు

రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ మంత్రి పి.అరుణ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వెంకన్న ఆలయంలో...

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవిని విశేషంగా అలంకరించి వేదికపై అదిష్టింపజేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



పాలిటెక్నిక్ కళాశాలలో భోగి మంటలు వెలిగిస్తున్న బెహరా భాస్కరరావు



ఆకట్టుకున్న ముగ్గు



గాలిపటాలతో చిన్నారులు

గోపాలపట్నం: నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు సందడిగా జరిగాయి. వేడుకలను బెహరా విద్యా సంస్థల చైర్మన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు రంగురంగు రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. భోగి మంటలు, డూడూ బసవన్నలు, హరిదాసులతో సందడి చేశారు. సంప్రదాయ బద్ధంగా పాలు పొంగించిన పాత్రలో ఆయన బియ్యం వేశారు. ఉపాధ్యాయులు పాయసం తయారు చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా భాస్కరరావు విద్యార్థులకు, అధ్యాపకులకు సంక్రాంతి సుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, అసిస్టెంట్ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెందుర్తి: మండలంలోని చింతలగ్రహారంలో రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.విజేతలకు రెడ్ ఎఫ్ఎం ఆర్‌జేలు ప్రదీప్, కృష్ణ, షర్మిల, నైర, మధు, కార్తీక్, నాయుడు, సుష్మ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ, పాఠకులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మపాలెంలోని శ్రీ మాధవస్వామి ఆలయంలో వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకొని ప్రతీ గ్రామంలో ఆయన ఆలోచనలు, భావాలను వివరించాలన్నారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసుపల్లి సోమశేఖర్, ఎంపీటీసీ దేవిరవి, పుష్యమిత్ర, రాజేంద్ర, కొండబాబు, చుక్క కృష్ణ, మాతృమూర్తులు పాల్గొన్నారు.

పెందుర్తి: యువతకు స్వామి వివేకానందుడి మార్గం అనుసరణీయం అని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. రచయిత కె.వి.ఎస్ నరసింహం మాట్లాడుతూ విశ్వానికి భారతీయ ఔన్నత్యాన్ని చాటిన మహోన్నత వ్యక్తి వివేకానందుడు అని కొనియాడారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాత హరిజగదీష్‌కు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు



దాత విజయ్‌కుమార్‌కు బాండ్ అందజేస్తున్న పీఆర్వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన బి.హరిజగదీష్ కుమార్ రూ. లక్ష , అలాగే అక్కయ్యపాలేనికి చెందిన ఆదారి విజయ్‌కుమార్ అనే దాత లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు ఏఈవో నరసింగరావు , పీఆర్వో అప్పలనాయుడు బాండ్లు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

588 మందికి వైద్య పరీక్షలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శుక్రవారం పెందుర్తి మండలం గొరపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 588 మందికి సేవలందించారు. ఇందులో 2 రిఫరల్ కేసులను వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు పంపారు. గైనకాలజిస్టు,జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్,డెంటల్ తదితర వైద్యులు రోగులకు సేవలు అందించారు.రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు.

14న పతంగుల పండగ

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 14న కైట్స్ ఫెస్టివల్ (పతంగుల పండుగ) నిర్వహిస్తున్నామని యూనిట్ కార్యదర్శి వి.ఆర్.కె.రాజు తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కళాక్షేత్రం మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఉక్కునగర వాసులు పాల్గొనాలని కోరారు.

ఆహ్వానపు వాలీబాల్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ జట్టుకు ట్రోఫీ

ఉక్కునగరం: ఆహ్వానపు వాలీబాల్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ వాలీబాల్ జట్టుకు ట్రోఫీ లభించింది. కర్ణాటక స్టేట్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8 తేదీల్లో హవేరి జిల్లా అనాజీలో ఆహ్వానపు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 8 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో స్టీల్‌ప్లాంట్ జట్టుకు ట్రోఫీ, రూ.20 వేల నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగం జీఎం మిశ్రా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో అధికారులు ముఖోపాధ్యాయ, శ్రీమన్నారాయణ, గుర్తింపు సంఘం నాయకులు గోవింద్, జి.రాజు, వై.సాంబశివరావు, ఉరుకూటి అప్పారావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సమన్వయం పవిత్ర యజ్ఞం



ప్రసంగిస్తున్న లుడ్గర్ , గురుప్రసాద్

మహారాణిపేట : ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమనేది పవిత్రమైన యజ్ఞమని జగద్గురు పీఠం భౌగోళిక కో–ఆర్డినేటర్ జర్మన్ దేశీయుడు లుడ్గర్ ఫిలిప్స్ పేర్కొన్నారు. అంకోసా ఫంక్షన్ హాలులో శుక్రవారం జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహించిన ప్రాక్పశ్చిమ సభా కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు మాస్టర్ ఈకే, గతంలో భౌగోళికంగా సేవలందించిన మాస్టర్ కె.పార్వతీకుమార్ వివిధ దేశాల్లో చేసిన ప్రసంగాలు, వారు రాసిన గ్రంథాల్లో ఉన్న పరమ గురువుల మార్గానికి నేడు వేలాది మంది పాశ్చాత్యులు ప్రభావితం చెందుతున్నారన్నారని లుడ్గర్ వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ భౌగోళిక నిర్వాహకులు కె.గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రాక్పశ్చిమ యజ్ఞ నిర్వహణలో భాగంగా మాస్టర్ పార్వతీకుమార్ 65 పర్యాయాలు విదేశాలలో పర్యటించారన్నారు. మాస్టర్ ఈకే రాసిన ఓవర్సీస్ మెసేజెస్ 8వ సంపుటాన్ని, అలాగే పార్వతీకుమార్ రాసిన సెవెన్ రేస్ ఆఫ్ లైట్ అనే జర్మన్ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరించారు. స్పెయిన్ వనిత డోనా, అర్జెంటైనాకు చెందిన రేయన్స్, సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, జ్యోతిషాచార్య ఎస్ఎస్ఎస్ రాము, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

1065వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేద్దామనుకునే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షల్లో 1065వ రోజు, శుక్రవారం పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.